క్లుప్తంగా

టీచర్లు, ఆయాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కేశంపేట: ప్రభుత్వం కొత్తగా ప్రారంభించనున్న ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు మండలంలోని రెండు గ్రామాల్లోని పాఠశాలలను ఎంపిక చేసిందని, ఇందులో పనిచేసేందుకు టీచర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ మఠం చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, కేశంపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు ప్రీప్రైమరీ తరగతులకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాలల్లో పనిచేసేందుకు అర్హులైన స్థానిక మహిళలు టీచర్, ఆయాల పోస్టులకు సెప్టెంబర్ 6 వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీచర్ పోస్టుకు ఇంటర్, ఆయాగా పనిచేసేందుకు 7వ తరగతి మహిళలు అర్హులన్నారు. ఇతర వివరాలకు ఎమ్మార్సీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ధర్నాను జయప్రదం చేయండి

శంకర్‌పల్లి: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా ఉంటుందని, ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీసీల సంక్షేమానికి కృషి

–టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన బిల్లులు రూపొందించిన సర్కార్.. దానిని అసెంబ్లీలో అన్ని పార్టీలు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేయడం బీసీల వర్గానికి ఎంతో మేలు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి డిక్లరేషన్‌లో చేసిన తీర్మానానికి అనుగుణంగా అసెంబ్లీ సమావేశాలలో అన్ని పార్టీల సమక్షంలో బీసీలకు దారి చూపిందన్నారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాలలో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఇది అవకాశం అన్నారు.

రాహుల్‌గాంధీ మోదీకి క్షమాపణ చెప్పాలి

బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కావ్య


పోలీసుల అదుపులో నాయకులు

చేవెళ్ల: దేశ ప్రజలకు, ప్రధాని మోదీకి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి గౌండ్ల కావ్య, మండల నాయకుడు జి.కృష్ణాగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నగరంలోని ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ నాయకులను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై, అతని తల్లిపై రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దీంతో దేశ ప్రజలు, బీజేపీ శ్రేణుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవం ఏమిటో అర్థం అవుదోందన్నారు. దీనికి నిరసనగానే రాష్ట్ర పార్టీ నగరంలో ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. ధర్నాకు వెళ్లకుండా మండలంలోని బీజేపీ నాయకులను ఎక్కడికక్కడే అరెస్టులు చేశారని, ఇది సరికాదన్నారు. దేశంలోని మహిళామణులు బీజేపీ శ్రేణులు అంతా కలిసి తగిన విధంగా కాంగ్రెస్ నేతలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

పోలీసు పహారాలో యూరియా పంపిణీ

కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఆదివారం సీఐ సీతారామ్, ఏఓ లావణ్య ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కొనసాగింది. 450 బస్తాలు అందుబాటులో ఉండగా.. ముందుగా జారీ చేసిన టోకెన్ల వారీగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. సోమ, మంగళవారాల్లో యూరియా రానుందని, మిగిలిన రైతులకు వచ్చిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.


చేవెళ్ల: వినాయకుడి నిమజ్జనోత్సవంలో నృత్యాలు చేస్తున్న ఉత్సవ సభ్యులు


చేవెళ్ల: గుండాలలో వినాయకుడి లడ్డూ దక్కించుకున్న గ్రామస్తులు

జైజై గణేశా..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు ఆదివారం వాడవాడలా వివిధ రూపాల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యకు భక్తులు, ఉత్సవ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లు, వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి జైజై గణేశా..జైకొడతా గణేశా.. జయములివ్వు బొజ్జగణేశా అంటూ వేడుకున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పలు గ్రామాల్లో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేక పూజల అనంతరం బ్యాండుమేళాలతో, యువకుల నృత్యాలతో స్వామివారిని గంగమ్మ ఒడికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలు హోరాహోరీగా కొనసాగాయి.


షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో వినాయకుడి పూజలో పాల్గొన్న నాయకులు


చేవెళ్ల: సీపీఐ కాలనీలో..


మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో..


షాద్‌నగర్‌రూరల్: గణనాథుడిని గంగమ్మ ఒడికి తరలిస్తున్న చిన్నారులు


షాబాద్: సంకెపల్లిగూడలో వినాయకుడి పూజలో పాల్గొన్న గ్రామస్తులు


కొత్తూరు: వినాయకుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


కేశంపేట: కొండారెడ్డిపల్లిలో..


మొయినాబాద్: సురంగల్‌లో..


షాబాద్: మండల కేంద్రంలో..

నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేయండి

రచ్చబండ వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల వినతి

చేవెళ్ల: ఈ నెల 6వ తేదీన నిర్వహించే చేవెళ్ల రచ్చబండ వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని మున్సిపాలిటీతో పాటు మండల ప్రజలు పాల్గొని పెద్దఎత్తున విజయవంతం చేయాలని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రచ్చబండ వినాయక ఉత్సవాల్లో ప్రత్యేకత అయిన వినాయకుడి లడ్డూ వేలం పాటను పాత పద్ధతిలోనే నిర్వహించేందుకు గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ నిర్ణయించిందని ప్రకటించారు. గతేడాది నూతన విధానంలో ముందుగానే వేలంపాటలో పాల్గొనే భక్తులు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలనే నియమాన్ని ఈఏడాది తొలగిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో ఆసక్తి ఉన్న భక్తులు ఎవరైనా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ సారి లడ్డూ లక్షల రూపాయలు పలుకుతూ జిల్లాలో ప్రత్యేక స్థానం చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందేనన్నారు. 6వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు లడ్డూ వేలం, రాత్రి 7 గంటలకు నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ విషయాన్ని భక్తులందరూ గమనించి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


చేవెళ్లలోని రచ్చబండ వద్ద ప్రతిష్ఠించిన భారీ వినాయకుడు

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ సూచనల మేరకు అతిథి అధ్యాపకుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, డిగ్రీ కళాశాలలో కామర్స్ కోర్సులో బోధనకు ఈ నియామకాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు గాను సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీ పొంది ఉండాలని జనరల్ అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగినవారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో చేవెళ్ల డిగ్రీ కళాశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తులను అందించేందుకు సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుందని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

స్థానిక సంస్థల మండల కన్వీనర్ మహేశ్

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని స్థానిక సంస్థల మండల కన్వీనర్ కంచుకోట మహేశ్ అన్నారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకుల, పోమాల్‌పల్లి, దేవునిగుడితండాల్లో ఆదివారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహాయాదవ్‌తో పాటు మహేశ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులకు సబ్సిడీపై యూరియాను అందిస్తుందని, నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లలో కూడా కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న విషయాన్ని లబ్ధిదారులకు, గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, ఉపాధ్యక్షుడు కంచుకోట నర్సింలు, ఎస్టీ మోర్చా నాయకులు రాజు నాయక్, జెట్టూరి గోపాల్‌రెడ్డి, కుమారస్వామిగుప్తా, కృష్ణయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అకుల గోపాల్, చాకలి మహేందర్, లాలమోని యాదగిరి, శ్రీరాములునాయక్, మహేశ్, శివ, రాజు, చింటూ, వంశీ తదితరులు పాల్గొన్నారు.


పోమాల్‌పల్లిలో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

పట్టపగలు వెలుగులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తోల్‌కట్ట చౌరస్తాలో వీధిదీపాలను నూతనంగా ఏర్పాటు చేశారు. వాటికి ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరంతరం వెలుగుతున్నాయని ఆ కాలనీ ప్రజ లు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి స్విచ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.


తోల్‌కట్టలో వెలుగుతున్న వీధిదీపాలు


మహబూబ్‌నగర్ రోడ్డులో స్వర్ణగిరి దేవాలయాన్ని తలపించేలా ఏర్పాటు చేసిన మండపం

ఆకట్టుకుంటున్న మండపాలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని యువకులు కొత్త ఆలోచనలతో వినాయక మండపాలను వినూత్నంగా తీర్చిదిద్దారు. వివిధ ఆకారాలలో ఏర్పాటు చేసిన మండపాలు, విభిన్న రూపాలలో నెలకొల్పిన వినాయకులు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. గణనాథులను తిలకించేందుకు పట్టణంతో పాటుగా వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. –షాద్‌నగర్‌రూరల్


విజయనగర్‌కాలనీలో అయ్యప్పస్వామి రూపంలో ఉన్న విఘ్నేశ్వరుడు.


పటేల్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ఆపరేషన్ సింధూర్ మండపం


విజయనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన పదునెట్టాంబడి(18 బంగారు మెట్లు)

ఐక్యతతోనే హక్కులు సాధ్యం

ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య

షాద్‌నగర్: ముదిరాజ్‌లు ఐక్యతతో ముందుకు సాగాలని, తద్వారా తమ హక్కులను సాధించుకోవచ్చని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాబయ్య హాజరై మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి పాలకులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లు అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం తాలుకా గౌరవ అధ్యక్షులు చెట్ల జంగయ్య, అంచరాములు, అందె పైలయ్య, తాలుకా యువ అధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ

షాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతుగల్, సీతారాంపూర్ గ్రామాల్లో నూతన కమిటీ నియమించారు. సీతారాంపూర్ అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పాండు, యువజన అధ్యక్షుడిగా రమేశ్, పోతుగల్ గ్రామ అధ్యక్షుడిగా వీరంపల్లి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు నవీన్, యువజన అధ్యక్షుడిగా కావలి అరవింద్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి నవీన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని, జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలందరూ రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలందరూ పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పారు. బీసీల హక్కుల సాధనకు తాము నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షుడు దయాకరచారి, ఉపాధ్యక్షుడు మీరంపల్లి అజయ్‌కుమార్, నాయకులు మహేందర్, శ్రీశైలం, శివ, అబ్బాస్, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సందీప్, రాములు, చారి, బాలకృష్ణ, పాండు, శ్రీనివాస్ ముదిరాజ్, సురేష్, జగన్, వెంకటయ్య, రాజుగౌడ్, మల్లేష్, పోచయ్య, వెంకటేష్, జైపాల్, కృష్ణ, శ్రీశైలం, ఆనంద్, తదితరులున్నారు.


పోతుగల్‌లో నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

రాష్ట్ర సెన్సార్ బోర్డు సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్: బీజేపీ పాలనలోనే దేశం మరింత పురోగమిస్తుందని రాష్ట్ర సెన్సార్ బోర్డు సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ పటేల్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాకతీయ పాఠశాలలో ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ నేతలు వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. వరదలు, ప్రకృతి విపత్తుల సమయాల్లో కేంద్ర ప్రభుత్వం బాధితులను ఆదుకుంటుందని, ఈ విషయాలను ప్రధాని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మల్చలం మురళీ, నర్సింలు, రామకృష్ణయాదవ్, ఆంజనేయులు, సురేష్, వెంకటేశ్, విఠల్, రామకృష్ణగౌడ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: మండల కేంద్రంలో మున్సిల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతలు ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. వర్షాకాలంలో వస్తున్న ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా కేంద్రం నుంచి కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తుందని చెప్పారన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అభిలాశ్‌రెడ్డి, వెంకటేశ్, రఘునాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


షాద్‌నగర్: మన్‌కీ బాత్ వీక్షించిన అనంతరం మాట్లాడుతున్న నాయకులు

బీజేపీతోనే నిరుపేదలకు న్యాయం

కొత్తూరు: బీజేపీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెంజర్లలో ఆదివారం ఆయన కార్యకర్తలతో కలిసి ప్రధాని మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధానిగా ఆయన దేశానికి, ప్రజలకు చేస్తున్న సేవలు అనిర్వచనీయమన్నారు. గతంలో దేశాన్ని పాలించిన నేతలు సొంత కుటుంబాలకు మాత్రమే మేలు చేశారని ఎద్దేవా చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఖ్యాతి ప్రపంచ దేశాలను తాకిందన్నారు. బీజేపీ పాలనలో మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచంలోనే బలమైన దేశంగా అవతరించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, ఇంద్రసేనారెడ్డి, జంగయ్య, మురళీ, శేఖర్, రవి, పెంటయ్య, మాధవులు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల: మండల కేంద్రంలో మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న నాయకులు